# నేనూ - ఇంపోర్టెడ్ కెమేరా...

## మల్లిక్



**మల్లిక్**

పుట్టింది రాజమండ్రిలో. పెరిగింది హైదరాబాదులో. ప్రస్తుతం ఆంధ్రా బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాను. సంగీతం అన్నా, హాస్యం అన్నా ప్రాణం. ఆంధ్రభూమిలో "చిట్టి", "సిగ్గు సిగ్గు", "నవ్వితే నవరత్నాలు", కారవాన్‌లో "శ్రీకాంత్", చంపక్‌లో "చుంచూ", సుమన్ సౌరభ్ (హిందీ)లో "లల్లీ" నేను నిర్వహించే రెగ్యులర్ ఫీచర్లు. త్వరలో ఆంధ్రప్రభలోనూ, ఉమెన్స్ ఎరాలోనూ మరో రెండు రెగ్యులర్ ఫీచర్లు నిర్వహించబోతున్నాను.

**నేను** ఏర్‌పోర్టుకి బయలుదేరా. ఏర్‌పోర్టుకి ఎందుకు బయలు దేరానంటే...

వారం క్రితం అమెరికాలో ఓ పెద్ద కంపెనీలో పని చేస్తున్న నా స్నేహితుడు చిదంబరం నాకు ఉత్తరం రాశాడు- తనతోబాటే పని చేస్తున్న విలియమ్ జేమ్స్ అనే అతను ఇండియా చూడడానికి వస్తున్నాడనీ, రెండు మూడు రోజులు బాంబేలో గడిపి హైదరాబాదు వస్తున్నాడనీ, నన్ను ఏర్‌పోర్టు కెళ్ళి ఆయనని రిసీవ్ చేసుకుని ఊరంతా చూపెట్టమనీ. ఉత్తరంతోబాటు నేను గుర్తు పట్టడానికి గాను జేమ్స్ ఫోటో జత పరిచి పంపించాడు చిదంబరం.




ఆ రోజే జేమ్స్ హైదరాబాదు వచ్చే రోజు.

నేను ఏర్‌పోర్టుకి వెళ్ళి జేమ్స్‌ని రిసీవ్ చేసుకుని నన్ను అతనికి పరిచయం చేసుకున్నాను.

"ఏదేని మంచి హొటల్‌కి తీస్కెళ్ళండి" అన్నాడు జేమ్స్ బుజాలు ఎగరేస్తూ.

"మీరు హొటల్లో ఉండడానికి వీల్లేదు. నా ఆతిథ్యం స్వీకరించండి...నా గదికి పోదాం పదండి" అన్నాను.

జేమ్స్- "వద్దు. బుషిబాబుగారూ! మీకు పాల ఇబ్బంది " అంటూ అడ్డు చెప్పబోయాడు గానీ, నేను అతనిని నా గదిలో ఉండడానికి ఒప్పించాను.

ఇద్దరం ఆటో ఎక్కి ఇంటి ముందు దిగాం. జేమ్స్ తను ఇస్తానన్నా వినకుండా మీటరు నేనే పే చేశాను.

"ఏంది. సార్...మీటర్ మీద రెంద్రూపాయల్ ఎక్స్‌ట్రా ఇవ్వాలి " అన్నాడు ఆటోవాడు.

"నువ్వు ముందు చెప్పలేదుగా?" అన్నాను నేను.

"అట్లెట్లియ్యర్?...వారెవ్వా...ఏర్‌పోర్టు, రైలు స్టేషన్ల ఆటో ఎక్కితే ఎక్స్‌ట్రా ఇవ్వాలని తెలీదూ?..."

"నే నివ్వను" అన్నాను మొండిగా.

"గిట్ల చేస్తే జబర్దస్తగ గుంజు కోవాల్సుంటుంది" అన్నాడు వాడు. నా కాలరు పట్టుకుంటూ.

"ఏంటీ గొడవ...హేయ్ వదులు వదులు" అంటూ మా ఇద్దర్నీ విడదీశాడు జేమ్స్.

"వాడు మట్లాడేది కూడా తెలుగే. హైదరాబాదులో తెలుగు అలానే మట్లాడతారు. వాడికి మీటరుమీద రెండు రూపాయలు ఎక్స్‌ట్రా కావాలట." చెప్పాను.

జేమ్స్ నా వంక ఆశ్చర్యంగానూ, తరవాత ఆటోవాడి వంక మెచ్చికోలుగానూ చూశాడు.

"శానా మంచివాడు. శానా మంచివాడు" అని జేబులోంచి చటుక్కున పది రూపాయలు తీసి ఆటోవాడికి ఇచ్చాడు.

ఆటోవాడు జేమ్స్‌కి సలాం చేసి వెళ్ళిపోయాడు.

"వాడు శానా మంచివాడు. అందుకే కాలర్ పట్టుకున్నాడు. అదే మా అమెరికాలో అయితే టాక్సీ వాళ్ళకి టిప్పు ఇవ్వకపోతే షూట్ చేసేస్తార్..." అన్నాడు జేమ్స్ బుజాలు ఎగరేస్తూ.

నేను రెండు రోజులు ఆఫీసుకు శలవు పెట్టి జేమ్స్‌ని హైదరాబాద్ మొత్తం తిప్పాను. వెళ్ళినచోటల్లా జేమ్స్ తన కెమెరాతో ఫోటోలు తీశాడు.

"నేను రేపు ఆంధ్ర వెళ్ళి అక్కడి విలేజీలు తిరుగుతాను. అక్కడ సీనరీ బాగుంటుందని చిదంబరం చెప్పాడు...వారం తరవాత హైదరాబాద్ వచ్చి బాంబే పోయి అక్కడినుండి అమెరికా పోతాను" అన్నాడు జేమ్స్.

నేను అలాగే అన్నట్టు తల ఊపాను.

జేమ్స్ నా ఫోటో ఒకటి తీస్తా నన్నాడు. నేను చేతులు కట్టుకుని కెమెరాకి ఫోజు ఇచ్చాను.

"రెడీ...కాస్త నవ్వండి" అన్నాడు కెమెరా లెన్సుని అడ్జస్టు చేస్తూ.

నేను నవ్వాను.

"ఇదే మాఅమెరికాలో అయితే షూట్ చేస్తారు. అటుల శబ్దం వచ్చులాగ నవ్వకండి" అన్నాడు.

నేను మూతి బిగించేశాను.

రెండు మూడు యాంగిల్స్‌లో నా ఫోటోలు తీశాడు జేమ్స్. కెమెరాలోంచి రీలు తీసి, "అమెరికాలో ప్రింట్ సేసి పంపిస్తాన్" అన్నాడు.

"మీ కెమెరా చాలా బాగుంది" అన్నాను అతనితో.

"మీకు నచ్చిందా...అయితే తీస్కోండి" అన్నాడు జేమ్స్ కెమెరాని ముందుకు చాపుతూ.

"అబ్బే ఎందుకండీ...ఆంధ్రాలో సీనరీలవీ తియ్యడానికి మీకు కావాలిగా" అన్నాను నేను.

"నా దగ్గర ఇంకోటి ఉంది...ఇది మీరు తీస్కోండి."

"అబ్బే...ఎందుకు లెండి." నేను మెలికలు తిరిగాను.

"అదే మాఅమెరికాలో అయితే ప్రెజెంటేషను ఇస్తే వద్దని అంటే షూట్ సేస్తారు. తీస్కోండి" అన్నాడు కరకుగా.

నేను ఎంతో సంబరపడిపోతూ కెమెరాని అందుకున్నాను.

మర్నాడు జేమ్స్ ఆంధ్ర వైపు ఊళ్ళు తిరగడానికి వెళ్ళిపోయాడు.

చాలా కాలంగా ఒక మంచి కెమెరా కొందామని అనుకుంటున్నా కానీ, కుదర్లేదు. అనుకోకుండా జేమ్స్ మంచి కెమెరా ప్రెజెంట్ చేశాడు.

ఇంపోర్టెడ్ కెమెరా!

నా మనసు ఆనందంతో ఊయల లూగింది.

"ఏంటలా ఊగిపోతున్నావ్? తాగావా?...ఇన్నాళ్ళూ బుద్ధిమంతుడిలా ఉండేవాడివి... ఈ ముదనష్టపు అలవాటెలా అబ్బిందిరా నీకు?"చంచ్రావు గొంతు వినిపించిందినాకు.

తూలకుండా తమాయించుకుని నిలబడి చూశాను.

గుమ్మంలో చంచ్రావు నిలబడి ఉన్నాడు.

నాకు చచ్చేంత నవ్వొచ్చింది. ఘొల్లున నవ్వేశాను."హొరి అమాయకపృక్షీ...నేనా...తాగడమా?"

"అంటే నువ్వు తాగలేదని అంటావ్?"

"ఏం తాగినట్టు కనిపిస్తున్నానా?"

"మరి తూగి పోతున్నావేం?"

"ఆనందం...మనసు ఉయ్యాల లూగిపోతోంది." అన్నాను ఊగిపోతూ.

చంచల్రావు నన్ను కదలకుండా పట్టుకున్నాడు."ఎందుకు ఊగుతుంది?" అని అరిచాడు న స్పెన్సు భరించలేక.

వాడి పట్టు విడిపించుకుని అల్మారాలోంచి కెమెరా తీ ిసి చూపించాను.

చంచల్రావు కళ్ళు పెద్దవి చే ిసి చూశాడు ఆశ్చర్యంగా."ఇంపోర్టెడ్ కెమెరా! నీ కెక్కడిది?"

నేను జరిగినదంతా చెప్పాను.

"కెమెరా చాలా బాగుంది. చాలా ఎడ్జస్టుమెంట్సున్నాయే...ఎలా ఉపయోగించాలో నీకు తెలుసా, బుచ్చిబాబూ?"

"లేదురా...జేమ్స్ మళ్ళీ వారంలో ఇక్కడికి వస్తాడు. అప్పుడు అడిగి తెలుసుకుంటాను." అన్నాను.

"అప్పటిదాకా ఎందుకురా, బుచ్చీ...మన కాలనీలో ఫోటో స్టూడియో ఉందిగా. అక్కడికి వెళ్ళి కెమెరా చూపించి దీన్నెలా ఉపయోగించాలో వాడి నడుగుదాం..." అన్నాడు చంచల్రావు.

వాడి సలహా నాకు నచ్చింది.

ఇద్దరం కలి ిసి ఫోటో స్టూడియో కెళ్ళాము.

స్టూడియో ముందు "ఇచ్చట మీ మొహంలాగే



ఫోటోలు తియ్యబడును" అని బోర్డుంది.

"స్టూడియో ముందు ఇలాంటి బోర్డు పెట్టాడంటే వీ డెంతో నిజాయితీ పరుడై ఉండాలి" అన్నాడు చంచల్రావు.

ఇద్దరం స్టూడియోలోకి అడుగు పెట్టాం.

"రాండి, సార్...రాండి" అంటూ మా ఇద్దర్నీ సాదరంగా ఆహ్వానించాడు స్టూడియో యజమాని యాదగిరి.

"ఒరేయ్ కిషన్!సార్‌లకి రెండు చాయ్‌లు చెప్పరా"! అని లోపలికి చూస్తూ అరిచాడు యాదగిరి.

"అబ్బే...మేం ఫోటో తీయించుకోడానికి రాలేదు, యాదగిరిగారూ" అన్నాడు చంచల్రావు.

మళ్ళీ లోపలికి చూస్తూ అరిచాడు యాదగిరి."కిషన్..చాయ్‌లు కాన్సిలని చెప్పరా..."

మేము ఇబ్బందిగా నవ్వాము.

"ఫోటోలు తీయించుకోడానికి కాబోతే మల్లెందుకొచ్చింద్రు ఈడికి?" అన్నాడు యాదగిరి చిరాగ్గా చూస్తూ.

నేను నా చేతిలోని కెమెరాని టేబుల్‌మీద యాదగిరి ముందు పెట్టాను.

చంచల్రావు విషయం చెప్పాడు.

యాదగిరి కెమెరాని చేతిలోకి తీసుకున్నాడు. అతని కళ్ళు వెలిగిపోయాయ్."వారెవ్వా ... కెమెరా జబర్ద ్స్త ఉంది సార్. ఫారెన్ది. లే?"

అవునన్నట్టు మే మిద్దరం తల లూపాము.

"నాకు అమ్మేయ్యండి, సార్... మీ అస్సంటోళ్ళకి గిస్మంటి కెమెరా ఎందుకు సార్...గిది స్టుడియోల పంజేస్తది... నా కిచ్చేయండి, సాబ్... అర్రే కిషన్! రెండు చాయ్‌లు చెప్రా..." అని లోపలికి చూస్తూ అరిచాడు యాదగిరి.

"అబ్బే...ఇది అమ్మడానికి కుదర్దోయ్...నాకు ఒకతను ప్రజెంటేషను ఇచ్చాడు. దీన్ని ఎవ్వరికీ ఇవ్వను" అన్నాను నేను, కెమెరాని యాదగిరి చేతిలోంచి లాక్కుంటూ

"అర్రే కిషన్...చాయ్‌లు కాన్సిలని చెప్పరా" అన్నాడు యాదగిరి మళ్ళీ లోపలికి అరుస్తూ."మల్లెందు కొచ్చిన్రు, సాబ్, నాది వకత్ ఖరాబ్ చే సేన్దుకు?" చిర్రుబుర్రు లాడాడు యాదగిరి.

"చెప్పేం కదండీ, యాదగిరి గారు..., దీని అడ్జస్టుమెంట్లవీ ఎలా చెయ్యాలో, ఫోటోలు ఎలా తియ్యాలో మీరు చెప్తారని..." అని మర్యాద ఒలకబోస్తూ అన్నాడు చంచల్రావు.

ఒక అయిదు నిమిషాలపాటు దాన్ని నిశితంగా పరిశీలించి కెమెరాని ఎలా ఉపయోగించాలో చెప్పాడు యాదగిరి.

"ఎలాగూ ఇక్కడికి వచ్చాం కదా... ఒక రీలు కొని ఫోటోలు తీద్దాం... ఈ కెమెరాతో ఫోటోలు తీ స్తే ఎలా వస్తుందో తెలుస్తుంది" అన్నాడు చంచల్రావు.

"మా ఇస్టుడియోల రీళ్ళుభి అమ్ముతాం, సార్" అన్నాడు యాదగిరి హుషారుగా.

"సరే...ఒక రోల్ ఎంత?" అని అడిగాను.

"నల్ పై రూపాయల్,సాబ్!"

"నలభై ఎందుకూ?"

"కలర్ ఫిల్ము, సాబ్!"

"కలర్ ఫిల్ము వద్దులే... బ్లాక్ అండ్‌వైటు చాలు."

"అర్రే. ఏంది సాబ్? బ్లాక్ అండ్ వైట్ అయితే ఇర్వై రూపాయలే. కలర్ ఫిల్ము అయితే నల్ పై రూపాయల్. ఇర్వై రూపాయల్‌కి ఏం జూస్తావ్, సాబ్? కలర్‌ల ఫోటోలు మంచిగ కొస్తది" అన్నాడు.

"కలర్ ఫిల్మే తీస్కోరా" అన్నాడు చంచల్రావు.

నేను కలర్ ఫిల్ము తీసుకున్నా.

"ఫోటోలు నా తోనే కడిగించండి, సార్" అన్నాడు యాదగిరి పళ్ళికిలిస్తూ.

"సరేనోయ్" అన్నాడు వాడికి చంచల్రావు అభయం ఇస్తూ.

"అర్రే కిషన్!రెండు చాయ్ చెప్పరా..." అని లోపలికి చూస్తూ అరిచాడు యాదగిరి.

ఇందాకట్నుండీ నా మనసులో పీకుతున్న సందేహాన్ని అడిగేశాను.

"అవును గానీ, మీ స్టూడియో ముందు 'ఇచ్చట మీ మొహం లాగే ఫోటోలు తీయబడును' అని బోర్డు పెట్టావు కదా...అలా గెందుకు పెట్టావ్?"

"అదీ భి సమజ్ కాలేదా, సార్, మీకు?" అంటూ ఘొల్లున నవ్వాడు యాదగిరి.

మే మిద్దరం జేబు రుమాళ్ళతో ముఖం తుడుచుకున్నాం.

"చమించాలి,సార్! నేను నవ్వితే గట్లనే జల్లు పడ్తది. ఆ ఏమంటిరీ... గా బోర్డెందుకు పెట్టినాననా? సార్! వేరే స్టుడియోల ఫోటో దీయించుకుంటే మీ ముఖం మీది ముకంలా కన్పడదు. గదే మా స్టూడియోల దీయించుకుంటే మీది ముఖం మీదిలానే కన్పిస్తది...సమజైంది కదా. హోహహ..."

మే మిద్దరం వెనక్కి తిరిగాం.

యాదగిరి నవ్వు ఆపాడు.

మళ్ళీ మేము ముందుకు తిరిగాం.

కిషన్ అనే కుర్రాడు లోపలినుండి టీలు తెచ్చాడు. మేము టీ తాగి బయట పడ్డాం.

గదికి వచ్చిన తరవాత చంచల్రావు అడిగాడు.

"ఒరేయ్ బుచ్చిబాబూ...ఈ కొత్త కెమెరాతో మొట్టమొదటిసారిగా నువ్వు ఎవరి ఫోటో తీద్దామని అనుకుంటున్నావు?"

"ఏ గర్ల్ ఫ్రండో ఉండి ఉంటే ఆ కోమలాంగిని తీ ిసి ఉండేవాడిని కానీ, ఎవరూ లేరు కదా! నీ కంటే నాకు ముఖ్యులు ఎవ రున్నారురా. ముందు నీ ఫోటోనే తీస్తాను. అలా నిల్చో..." అన్నాను




కెమెరాను అడ్జెస్టు చేస్తూ.

చంచల్రావు కిటికీలోంచి బయటికి చూ ిసి ఆనందంతో కెవ్వున కేకేశాడు.

"ఏమైందిరా,చెంచిగా? ఎవరైనా అమ్మాయా... నొక్కేస్తా. నొక్కేస్తా." అంటూ కెమెరాని అడ్జెస్టు చేస్తూ కిటికీ దగ్గరికి పరుగెత్తాను నేను.

"నీ ముఖం. వీథిలో ఎవరిదో కారు ఆగి ఉంది చూడు. ఇంపోర్టెడ్ కారు" అన్నాడు చంచల్రావు ఆనందంగా.

"అయితే ఏమిటి?"

"ఆ కారు దగ్గర నిలబడి ఫోటో తీయించుకుంటా." అని బయటికి ఉరికాడు చంచల్రావు.

నేను వాడిని ఫాలో అయ్యాను.

చంచల్రావు కారుకి జారబడి నిలబడిన ఫోటో ఒకటి, కారు ఫ్రంట్ డోరు దగ్గర చేతులు కట్టుకుని నిలబడిన దొకటి, బాయ్‌నెట్ మీద మోచేయి ఆనించి గెడ్డం కింద చెయ్యి పట్టుకుని నడుంమీద మరో చెయ్యి పెట్టుకుని ఉన్నట్టు

మరొకటి తీశాను.

"డ్రైవింగు సీటులో కూర్చుని ఉన్నట్టు తీయించుకుంటే బాగుంటుంది" అన్నాను.

చంచల్రావు కారు తలుపు లాగి చూసి, "లాక్ చేసుంది" అన్నాడు.

"పోన్లే. కారుతో తీయించుకున్నావుగా. ఇప్పుడు నేను నిలబడతాను. నువ్వు ఫోటో తియ్యి" అంటూ కమెరా చంచల్రావు చేతి కిచ్చి కారు దగ్గర నేను నిలబడ్డాను.

చంచల్రావు కమెరా అడ్జెస్టు చేసుకుంటూ "రెడీ" అన్నాడు.

నేను నవ్వాను.

"ఏంటా వెధవ నవ్వు? నువ్వేమైనా టీవీ యనౌన్సరువా. నువ్వేం నవ్వక్కర్లా.మామూలుగా నిలబడు." వళ్ళు కొరుకుతూ అన్నాడు చంచల్రావు.

కారు దగ్గర నాకు మూడు నాలుగు ఫోటోలు తీశాడు చంచల్రావు.

ఇంతలో నలుగురు పోలీసుల్ని వెంట బెట్టుకుని ఒకతను హడావిడిగా మాదగ్గరకు వచ్చాడు.

"వీళ్ళే...వీళ్ళే. పట్టుకోండి" అన్నాడతను.

"ఏమిటి?" అన్నాం మే మిద్దరం తెల్లబోయి.

"మీరు కారు దొంగతనం చెయ్యాలని ప్రయత్నిస్తున్నట్టు ఈయన మాకు కంప్లైంట్ ఇచ్చారు." ఒక పోలీసు అన్నాడు.

"అబద్ధం. మేము కారు బాగుంది కదా అని దాని దగ్గర ఫోటోలు తీయించుకుంటున్నాం" అన్నాను నేను.

"పచ్చి అబద్ధం. వీళ్ళు నా కారు తలుపులు పట్టి లాగుతూ తెరవడానికి ప్రయత్నించడం నేను చూశాను. కారు దొంగలు మేము కారు దొంగలం అని చెప్పుకుంటారా? అసలే ఈ మధ్య సిటీలో కారు దొంగతనాలూ, స్కూటర్ దొంగతనాలూ చాలా అవుతున్నయ్. ఆ ముఠాతో వీళ్ళకి సంబంధం ఉందనుకుంటా" అన్నాడు కారు ఓనరు.

అక్కడ కాలనీ జనం అంతా మూగారు. మేము అలాంటి వాళ్ళం కాదని వాళ్ళు పోలీసులకి చెప్పి చూశారు.

మేము ఎంత మొత్తుకున్నా పోలీసులు మా మాట వినకుండా పోలీసు స్టేషన్‌కి లాక్కెళ్ళారు.

ఆ ఇన్‌స్పెక్టర్ నన్ను అమాంతం కౌగలించుకున్నాడు. అతని బిగి కౌగిలికి నా షర్టు గుండీలు పటపట తెగి రాలిపోయాయ్.

"నిజం,సార్, నేను దొంగని కాను. నన్ను వదలండి" అన్నాను అతని కౌగిలినుండి విడిపించుకుంటూ.

"వదలనుగాక వదలను హ్హహ్హహ్హ" అంటూ నవ్వాడు.

నేను ఆశ్చర్యంగా ఇన్‌స్పెక్టర్ మొహంలోకి చూశాను.

"నేన్రా శివరాంని. నీ క్లాస్ మేట్‌ని. ఇక్కడ సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాను" అన్నాడు శివరాం.

యూనిఫాంలో ఉండడం వల్ల నేను వాడిని గుర్తు పట్టలేదు.

"ఓరి నువ్వటరా..."అంటూ నేను శివరాంని కౌగిలించుకున్నాను.

ఈ సారి శివరాం యూనిఫారమ్ గుండీలు పటపట తెగి రాలిపోయాయి.



నేను శివరాంకి జరిగిన సంగతంతా వివరంగా చెప్పాను.

"అదన్నమాట సంగతి. కానీ కమెరా మట్టుకు చాలబాగుందిరా" అన్నాడు.

"సార్... సార్! మన మందరం ఫోటోలు తీయించుకుందాం,సార్!" అన్నారు కానిస్టేబుల్స్.

"మావాళ్ళు సర్దా పడ్తున్నారు. కొన్ని స్నాపులు తియ్యవోయ్" అన్నాడు శివరాం.

కానిస్టేబుల్స్ అందర్నీ ఒక గ్రూపు ఫోటో; శివరాంని, కానిస్టేబుల్స్ అందర్తో కలిపి ఒక ఫోటో; కానిస్టేబుల్సుని ఒక్కొక్కడిని విడివిడిగా ఒక్కో ఫోటో; శివరాం ఒక్కడిని ఒక ఫోటో; నేను,శివరాం కలిసి ఒక ఫోటో; నేను,చంచల్రావు కలిసి ఒక ఫోటో; చంచల్రావు,శివరాం; నేను, కానిస్టేబుల్స్; చంచల్రావు కానిస్టేబుల్స్... ఇలా ఫోటోలు తీయించుకున్నాం.

"సార్! నా మరి నా ఫోటోనో?" అన్నాడు కారు ఓనరు.

"ఫిల్ము అయిపోయింది" అన్నాను నేను పళ్ళు కొరుకుతూ.

శివరాం దగ్గర శలవు తీసుకుని మేము బయట పడ్డాము.

"ఒరేయ్! మొత్తం రీలు అయిపోయిందిగా. స్టుడియోలో కడగడానికి ఇచ్చే స్తేనో?" అన్నాడు చంచ్రల్రావు.

కొత్త కెమెరాతో తీసిన ఫోటోలు ఎలా వస్తాయో చూడాలన్న ఆత్రుత నాకుకూడా ఉంది.

"పద. వెళదాం" అన్నాను.

ఫోటో స్టూడియోలోకి అడుగు పెట్టి యాదగిరికి రీలు ఇచ్చాము.

"కాస్త దీన్ని కడిగి ప్రింట్సు వేసి పెట్టాలి" అన్నాను.

"అర్రే కిషన్... రెండు చాయ్‌లు చెప్పరా!" అని అరిచాడు యాదగిరి.

"ఎంతౌతుంది?" అన్నాను.

"గిప్పుడే పైసల్ గురించి ఎందుకు, సార్! ఎన్ని ప్రింట్లు వస్తయో చూసి, గప్పుడు బిల్లు చెప్తా. రేపు రాండ్రి ఫోటోలు ఇస్త" అన్నాడు యాదగిరి.

మెర్నాడు మళ్ళీ స్టూడియోకి వెళ్ళాం.

మా ముందు కవరొకటి ఉంచాడు యాదగిరి.

"తీస్కోండి, సార్, ఫోటోలు. ముప్పై వచ్చినయ్. ప్రింటుకి నాల్గు రూపాయలు. ముప్పై ప్రింట్‌లకి నూటఇరవై రూపాయల్. డెవలపింగ్‌కి పద్దేను రూపాయల్. మొత్తం నూటముప్పైఅయిదు రూపాయల్."

నూటముప్పైఅయిదు ప్లస్ ఫిల్ము నలబై రూపాయలు మొత్తంనూటడెబ్బైఅయిదు రూపాయలు!

నేను గుండెలు బాదుకున్నాను.

ఈ లోగా చంచల్రావు ఫోటోలు చూస్తూ పళ్ళు కొరకడం మొదలు బెట్టాడు.

"ఏంట్రా ఈ ఫోటోలు?" అని రంకె వేస్తూ ఫోటోలు నా చేతిలో పెట్టాడు.

నేను చంచల్రావుని కారుతోబాటు తీద్దామని ప్రయత్నించిన ఫోటోలు అవి.

ఒక దాంట్లో చంచల్రావు తలకాయ ఒక్కటే పడింది. ఇంకో దాంట్లో చంచల్రావు కాళ్ళు, కారు టైరు పడింది. మరో దాంట్లో బోయ్‌నెట్, చంచల్రావు చెయ్యి పడింది.

పోలీసు స్టేషన్లో ఫోటోలుకూడా అలానే వచ్చాయి.వరసగా పోలీసుల టోపీలు ఒక దాంట్లో ఇంకో దాంట్లో వరసగా వాళ్ళ నిక్కర్లు. నేనూ శివరాం తీయించుకున్న దాంట్లో (ఆ ఫోటో చంచల్రావుగాడు తీశాడు) మా తలకాయలు లేకుండా వట్టి మొండేలు పడ్డాయి. మిగతా ఫోటోలుకూడా ఇదే మోస్తరుగా ఉన్నాయి.

ఈ ఫోటోలకి నూటడెబ్బైఅయిదు రూపాయలా?

బేర్ మన్నాను నేను.

"బాధ పడకూండ్రి ,సార్! ఫోటోలు తీసుడు మొదటిసారిగెదా మరు మరుల గట్లనే వస్తయ్. తర్వాత మంచి గొస్తయ్" అన్నాడు యాదగిరి నన్ను ఊరడిస్తూ.

ఫోటోల బిల్లు పే చేసి మేము పోలీసు స్టేషనుకి వెళ్ళాం.

నే నిచ్చిన ఫోటోలన్నీ చూశాడు శివరాం.

"ఫోటోలు బాగా రాలేదని బాధ పడకోయ్. మళ్ళీ ఓ రీలు కొని ట్రై చెయ్. రేపు కమెరా తీస్కుని రా" అన్నాడు.

మళ్ళీ నూటడెబ్బై రూపాయలు క్షౌరం!

"అలాగే" అని చెప్పి నీరసంగా బయట పడ్డాను.

"ఒరేయ్ అన్నట్టు చెప్పడం మరిచాను. వచ్చే వారం మా చెల్లెలు పుట్టిన రోజు. ఆ రోజు మా ఇంటికి వచ్చి కొన్ని స్నాప్స్ తియ్యాలి నువ్వు" అని నా భుజం తట్టి వెళ్ళిపోయాడు చంచల్రావు.

నేను గదికి వచ్చేసరికి నా కోసం ఇంటి యజమాని ఎదురు చూస్తున్నాడు.

"మాజీతాలు ఎల్లుండి కదండీ" అన్నాను నేను ఆశ్చర్యంగా.

"భలే వాడివోయ్. నేను ఇంటి అద్దె కోసం రాలేదు. నీ దగ్గర ఇంపోర్టెడ్ కమెరా ఏదో ఉందటగా. కాస్త సర్దాగా మా అందర్నీ ఫోటో తియ్యకూడదూ?" అన్నాడు బట్టతలని బ్రహ్మానందంగా నిమురుకుంటూ.

"కానీ ఫిల్ముకీ. డెవలపింగ్‌కీ ప్రింట్స్‌కీ చాలా ఖర్చు అవుతుంది కదండీ" అన్నాను నీరసంగా.


"సరేకానీ అబ్బాయ్. వచ్చే నెల్లో మాతమ్ముడు కొడు కొకడు హైదరాబాదులో కాలేజీలో చేర్దామను కుంటున్నాడు. వాడొస్తే వాడి కీ గది ఇవ్వాలి. ఈ మహానగరంలో అద్దెకు గది దొరకడం కష్టమే. మరి నీకు ఎలానో ఏంటో పాపం. ప్చ్." అన్నాడు.

"అవును గానీ. ఈ వేళ సాయంత్రం అందరూ ఇంట్లోనే ఉంటారుగా. ఫొటోలు తీస్తాను" అన్నాను పిడికిళ్ళు బిగించి పళ్ళు కొరుకుతూ.

"ఉంటాం. బాబూ! అయినా నువ్వేం వర్రీ కాకు. వాడిని మరో చోట ఎక్కడైనా అద్దెకి ఉండమని చెప్తాలే" అన్నాడు.

ఆఫీను కెళ్ళగానేమాఆఫసరుగారు నాకు కబురు పెట్టాడు. ఆఫీసరు గదిలోనికి వెళ్ళాను. అతనుకూడా అదే కూత.

"నీ దగ్గర ఇంపోర్టెడ్ కెమెరా ఉందని విన్నాను. రేపు నా మనవడికి బారసాల జరుపుతున్నాం. నువ్వొచ్చి ఫొటోలు తియ్యాలోయ్" అన్నాడు.



నేను ఇబ్బందిగా మొహం పెట్టి చేతులు నలుపుకుంటూ, "హి హి హి" అన్నాను.

"నీకు వచ్చే నేల ఇంక్రిమెంటు డ్యూ అనుకుంటాను?" అన్నాడు అతను కొంటెగా నన్ను చూస్తూ.

"రేపే కదండీ. వస్తాను. అలాగే. హిహిహి. అలాగలేగే"అన్నాను.

సీట్లో కూలబడి టేబులు కేసి నా తల కసిదీరా బాదుకున్నాను.

ఆ రోజు రాత్రి ఎవరో తలుపు తడితే లేచి తలుపు తీశాను.

ఒకతను తిన్నగా గదిలోకి వచ్చి కుర్చీలో కూర్చున్నాడు.

"ఏంటిది?" అన్నాను గుడ్లు పెద్దవి చేసి ఆశ్చర్యంగా చూస్తూ.

నా ప్రశ్నకి సమధానం చెప్పకుండా, "నా డ్రెస్సెలా ఉందండీ?" అని నన్ను ఎదురు ప్రశ్న వేశాడు.

చిలకాకు పచ్చరంగు పంట్లాం మీదకి ఎర్ర చొక్కా వేసుకుని ఉన్నా డతను.

"ఎడ్చినట్టే ఉంది" అన్నాను నేను.

"కానీ కలర్ ఫొటోకి ఇలా రంగుల బట్టలేస్కుంటేనే బాగుంటుంది కదండీ" అన్నా డతను.

"కలర్ ఫొటోనా? అస లింతకీ ను వ్వెవరు?" అన్నాను నేను గజగజ వణికిపోతూ.

"మీ ఆఫీసరుగారి మేనల్లుడినండీ. మీ ఇంట్లో ఇంపోర్టెడ్ కెమెరా ఉందని తెలిసి నాలు గైదు ఫొటోలు తీయించుకుందామని వచ్చాను" అన్నాడు.

నేను తల పట్టుకుని కూలబడి పోయాను.

మర్నాడు ఉదయం నా గదికి కాని స్టేబుల్ వచ్చాడు."మాసర్కిలిన్ స్పెక్టరుగా రింట్లో ఫంక్షనేదో ఉందండి. సాయంత్రం కెమరా పట్టుకుని రమ్మన్నారు మిమ్మల్ని. ఫొటోలు తియ్యాలంట" అన్నాడు.

"వీల్లేదు. ఈ వేళ సాయంత్రం నాకు పన్లున్నాయి" అని అరిచాను నేను.

"అసలే మీ దగ్గరున్నది ఇంపోర్టెడ్ కెమెరా. మీకు ఏ స్మగ్లర్‌తోనో సంబంధం ఉందని కేసెట్టించి బొక్కలో తో సేస్తా రండి. ఆనక మీ ఇష్టం" అని వెళ్ళిపోయాడు కాని స్టేబులు.

సాయంత్రం నేను సర్కిల్ ఇన్ స్పెక్టరు ఇంటికి వెళ్ళక తప్పలేదు.

ఆ రోజు సాయంత్రం పోలీసులతో మా గది ముందు గొడవ అవడం మూలాన కాలనీలో అందరికీ తెలిసిపోయింది- నా దగ్గర ఇంపోర్టెడ్ కెమెరా ఉందని. రోజూ ఎవడో ఒకడు ఫొటోలు తీయించుకోవడానికి వస్తున్నాడు. నాకు రాను రాను మనశ్శాంతి కరువైంది. మొదట్లో ఎంతో ముద్దొచ్చిన ఆ కెమెరాని చూస్తుంటే ఇప్పుడు ఒళ్ళు మండిపోసాగింది.

చంచల్రావు సలహామీద ఆ కెమెరాని యాదగిరికి అమ్మెయ్యడానికి నిర్ణయించుకున్నాను.

నేను చంచల్రావు స్టూడియోకి వెళ్ళాము."ఈ కెమెరాని నీకు అమ్మెయ్యమని ఆ రోజు అడిగావుగా. నీకు అమ్మేద్దామని నిర్ణయించుకుని వచ్చాను. ఏమిస్తావ్?" అని అడిగాను.

"రెండొంద లిస్తా" అన్నాడు యాదగిరి.

"ఏమిటీ... రెండొందలేనా? ఈ కెమెరా రెండు వేలు ఖరీదు చేస్తుంది తెల్సా?" అన్నాడు చంచల్రావు.

"ఆయనకి ఊరికెనె వచ్చింది కద్సార్. అయినా, ఈ కెమెరాతో ఆయన గెట్ల బాధతో పడ్తున్నాడో నా కెరికైంది. అందుకే జాలి పడి కొంటున్నా" అన్నాడు యాదగిరి నన్నేదో ఉద్ధరిస్తున్నట్లు.


ఆ కెమెరాని వదుల్చుకోడమే నాకు ముఖ్యం అనిపించింది. అందుకే యాదగిరి చెప్పిన రేటుకి ఒప్పుకుని రెండొందలకే కెమెరా అమ్మేశాను.

మర్నాడు ఆంధ్రా అంతా తిరిగి జేమ్స్ నా దగ్గరి కొచ్చాడు."ఈ వేళ సాయంత్రం ఫ్లైట్‌లో నేను బొంబాయి వెళ్తున్నా. రేపు అమెరికా వెళ్తాను" అన్నాడు.

సాయంత్రం జేమ్స్‌తో బాటు నేను ఎర్‌పోర్టుకి వెళ్ళాను.

చెక్ ఇన్‌లోంచి వెళ్ళేముందు జేమ్స్ నన్ను తను ఇచ్చిన కెమెరా ఎలా ఉందని అడిగాడు. అలా అడుగుతాడని ముందే ఊహించిన నేను దానికి సమధానంకూడా రెడీగా పెట్టుకున్నా.

"కెమెరా చాలా బాగుందండీ. రిజల్టుకూడా బాగా వస్తోంది. కానీ నా దురదృష్టం. మొన్న నేను ఆఫీసుకు కెళ్ళినప్పుడు నా గదిలో దొంగ పడి కెమెరా దోచుకుపోయాడు. నాకు చాలా బాధ కలిగింది" అన్నాను విపరీతంగా బాధ నటిస్తూ.



"ఏం ఫరవాలేదు. మీరు పానా మంచివాడు" అని తన ఎర్‌బాగ్ జిప్పు వర్రుమనిలాగి ఇంకో కెమెరా తీసి నా చేతిలో పెట్టి -"ఇది తీస్కోండి. దానికంటే మంచి కెమెరా" అని, నాకు గట్టిగా షేక్‌హాండ్ ఇచ్చి అంతకన్నా గట్టిగా కౌగిలించుకుని, "వస్తాను. లెటర్స్ రాయండి" అని చరచరా వెళ్ళిపోయాడు.

నాకు ఏడుపు వచ్చింది.

మర్నాడు నేను ఆఫీసుకు వెళ్ళేముందు నా గదికి ఒకాయన ఫామిలీతో వచ్చాడు. ఎవరు కావాలని అడిగాను.

"ఇక్కడేదో కొత్తగా ఫోటో స్టూడియో పెట్టారని ఎవరో చెప్పారు. ఫోటో తీయించుకుందామని వచ్చాం బాబూ" అన్నాడు.

నేను గట్టిగా కేక పెట్టి మూర్ఛపోయాను. ★